

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

నల్గొండ
యాదాద్రి
సూర్యాపేట

మంగళవారం 14, అక్టోబర్ 2025 పేజీలు - 8


## మండలాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాలి

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్గొండ జిల్లా బ్యూరో

మండల ప్రత్యేక అధికారులు మండలాలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ఇంకా ప్రారంభించని ధాన్యం కొనుగోలు కేంద్రాలన్నింటినీ వెంటనే ప్రారంభించాలని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్ని సౌకర్యాలు ఉండాలని, ముఖ్యంగా అకాల వర్షానికి దాన్యం తడవకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కోరారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి సందర్భంగా ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం ఆమె జిల్లా అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. ప్రత్యేక అధికారులు మిగతా 3లో

## గోదావరి జలాలను పేట జిల్లాకు తీసుకొస్తాం

### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సూర్యాపేట ప్రతినిధి, మేజర్‌న్యూస్ ః గోదావరి జలాలను సూర్యాపేట జిల్లాకు తీసుకొచ్చేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి తన రక్తం, చెమటతో కాంగ్రెస్ పార్టీ జెండాను నిలబెట్టారని గుర్తు చేశారు. ఇప్పటికే ధాన్యం కొనుగోలు విషయంలో అన్ని జిల్లా కలెక్టర్లను కూడా అప్రమత్తం చేశామన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. దేశంలో 29 రాష్ట్రాల్లో ఎక్కువ వరి పంట గడిచిన పదకొండేళ్లలో ఎప్పుడు పండించని విధంగా ఈ సారి తెలంగాణరాష్ట్రంలోనే పండిందన్నారు. ఈ ఖరీఫ్‌లో 148.3 లక్షల మెట్రిక్ టన్నుల కనుగోలు చేసిందుకు సుమారు 24 వేల కోట్ల ఖర్చు చేసి ఒకే పంటను కొనుగోలు చేసేందుకు సివిల్ సప్లయ్ విభాగం సమాయత్తమైందన్నారు. ఈనెల 26న ఆదివారం హుజూర్‌నగర్‌లో పెద్ద ఎత్తున భారీ స్థాయి జాబ్ మేళా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తాను వ్యక్తిగత శ్రద్ధ పెట్టి జాబ్‌మేళా ఏర్పాటు చేశానని జిల్లా వ్యాప్తంగా నిరుద్యోగులు హాజరై జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 100 కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరై అక్కడికక్కడే ఇంటర్వ్యూలు చేసి నిరుద్యోగ యువతీ యువకులకు కొంతమందికి ఉపాధి కల్పించే విధంగా కషి చేస్తున్నామన్నారు. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు సంఘటన్ సజన్ అభియాన్ అనే కార్యక్రమాన్ని ఏఐసీసీ ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. ఏఐసీసీ పరిశీలకులు సారత్ రౌత్‌కు స్వాగతం తెలుపుతున్నామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్‌పార్టీ క్లీన్‌స్వీప్ చేయబోతుంని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రోజురోజుకు దినదినాభివద్ధి చెందుతూ మరింత బలపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణాలతో ప్రజల్లో ప్రభుత్వంపై మరింత విశ్వాసం ఏర్పడిందని తెలిపారు. ఆర్డీఆర్ ఎస్సారెస్పీ2గా నామకరణం చేశామని.. ఒకటి రెండు రోజుల్లో జీవో కూడా వెలువడనుందని చెప్పారు. ఎస్సారెస్పీ కాలువలు డ్యామేజ్‌తో పాటుగా లైనింగ్ కూడా చేపట్టే కార్యక్రమం కూడా త్వరలో చేపడతామన్నారు. సమావేశంలో కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్‌పద్మావతి, నాయకులు చెవిటి వెంకన్నయాదవ్, కొప్పుల వేణారెడ్డి, గుడిపాటి నర్సయ్య, చకిలం రాజేశ్వరరావు, వంగవీటి రామారావు పాల్గొన్నారు.

## స్వల్పకాలిక పనులు చేసే వారందరూ జీవిత బీమా సౌకర్యాన్ని కలిగి ఉండాలి

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్గొండ జిల్లా బ్యూరో

వాహనాల ద్వారా స్వల్పకాలిక పనులు చేసే వారందరూ జీవిత బీమా సౌకర్యాన్ని కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ జిల్లా త్రిపాటి అన్నారు. ఇందుకుగాను వివిధ బ్యాంకులు 2 లక్షల రూపాయల వరకు వివిధ రకాల బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నాయని, సంవత్సరానికి కేవలం 20/- రూపాయలు చెల్లిస్తే బీమా వర్తిస్తుందని తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి సందర్భంగా జిల్లా అధికారులతో ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా ఇటీవల కాలంలో స్వల్పకాలిక కార్మికుల సంఖ్య పెరిగిపోతున్నదని, ప్రత్యేకించి అమెజాన్, జొమాటో, ఫ్లిప్ కార్ట్, తదితర సంస్థలలో వాహనాల పై పని చేసేవారు, డెలివరీ చేసేవారు అలాగే డ్రైవ ర్లు, కార్మికులు వీరందరూ ప్రమాదవశాత్తు మరణించినా లేదా అంగవైకల్యం పొందినా బీమా సౌకర్యాన్ని పొందేందుకు ఆస్కారం ఉందన్నారు. ఇందుకుగాను 20 రూపా యల ప్రీమియం చెల్లిస్తే సరిపోతుందని, మరణిస్తే రెండు లక్షల రూపాయలు, అంగ వైకల్యం కలిగితే లక్ష రూపాయల జీవిత బీమా అందుతుందన్నారు. ఈ విషయంపై జిల్లాలోని అన్ని మున్సిపల్ కమిషనర్లు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇవే కాకుండా ఇంకా అనేక రకాల బీమా పథకాలు ఉన్నాయని, బ్యాంకర్లు సైతం దీనికి పూర్తి సహకారం అందించాలని చెప్పారు. ఆయా మున్సి పాలిటీ పరిధిలో పనిచేసే స్వల్పకాలిక కార్మికులందరికీ ప్రమాద బీమా వర్తింపజేసేందుకు శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. 20/- రూపాయల ప్రీమియంతో పాటు, ఆధార్, మొబైల్ నెంబర్ వంటివి ఇవ్వా లని, 18 నుండి 70 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారందరికీ బీమా చేసుకోవచ్చని ఆమె తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీ నివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఇన్చార్జి డిఆర్‌ఓ వై.అశోక్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, అధికారులు, మున్సిపల్ కమిషనర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ డేలో పలు ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్గొండ జిల్లా బ్యూరో

పోలీస్ గ్రీవెన్స్ డేలో పలు ఫిర్యాదులను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పరిశీలించారు. ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే పోలీస్ గ్రీవెన్స్ డేలో బాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 35 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకొవాలని, పోలీస్ స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్ట పరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని అన్నారు.



# సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

మునుగోడు, మేజర్‌న్యూస్ : మునుగోడు మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటికి వినతి పత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ డిఎల్పిఓకు సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జాతీయ మాల మహానాడు నేతలు మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలోని 1, 8, 9, 10, 13వ వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని పిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రధానంగా 1వ వార్డులో ప్రధాన రహదారి వెంట కంపచెట్లు పూర్తిగా నిండుకొని ఉండి, చెత్త చెదారంతో కూడుకొని దుర్గంధం వాసన వస్తుందన్నారు. కుక్కల బెడద ఒకవైపు, క్రిమి కీటకాల భయం మరో వైపు ప్రజలు వణుకుతున్నారనీ అవేదన వ్యక్తం చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో జాతీయ మాల మహానాడు నాయకులు బెల్లపు బాల శివరాజ్, బొల్లు సైదులు పాల్గొన్నారు.

# పాలకులను మేల్కొల్పేది కమ్యూనిస్టులే



చిట్యాల, మేజర్‌న్యూస్ : పాలకుల దోపిడి, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడేది కమ్యూనిస్టులే అని సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు.చిట్యాల మండలం చిన్న కాపర్తి గ్రామంలో ఆదివారం నాడు రాత్రి జరిగిన సిపిఎం సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.సంపన్న వర్గాలకు వేల కోట్ల రూపాయల మేర రాయితీలు ఇచ్చే ప్రభుత్వాలు, పేదల ఇండ్లు, ఇండ్ల స్థలాలు సకాలంలో పంపిణీ చేయకపోవడం విడ్డూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.చిన్నకాపర్తి గ్రామానికి చెందిన ఇరువై ఐదు కుటుంబాల వారు సిపిఎం,ప్రజా సంఘాల కార్యక్రమాలకు ఆకర్షితులై వీరారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు.ఈ సందర్భంగా వారు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.జిట్ట నగేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అవిశెట్టి శంకరయ్య, మండల నాయకులు కోనేటి రాములు,లడే రాములు, వివిధ ప్రజా సంఘాల నాయకులు రూపని ఇద్దయ్య,రుద్రారపు పార్వతమ్మ, మామిడి హనుమంతు, వీరమళ్ళ వెంకటేశ్వర్లు,గణేష్, దేశపాక సైదులు, పేర్వారం రాములు,అంజయ్య, శ్రీశైలం, విష్ణు, అంజి తదితరులు పాల్గొన్నారు.

# సైదాపురం గ్రామంలో అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించిన గుట్ట ఇన్స్‌పెక్టర్

యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో గల సైదాపురం గ్రామంలో సోమవారం రోజు సాయంత్రం మా యొక్క పోలీస్ స్టేషన్ సిబ్బందితో అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించి ప్రజలకు సీసీ కెమెరాల యొక్క విశిష్టతను, సైబర్ క్రైమ్ గురించి అవగాహన కలిగించి సోషల్ మీడియా వల్ల జరుగుతున్న ఫ్రాడ్స్, డిజిటల్ అరెస్ట్ గురించి అవగాహన సదస్సు నిర్వహించి అట్టి ఫ్రాడ్స్ బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేసి గ్రామ యువకులు, విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి. ఇలాంటి సంఘటనలు జరిగినచో పోలీసు వీరికి సమాచారం ఎలా ఇవ్వాలి. అని 112 టోల్ ఫ్రీ నెంబర్ యొక్క విశిష్టతను తెలియజేయడం జరిగింది.



# చీఫ్ జస్టిస్ దళితుడు కాకపోతే ఈ దాడి జరిగేది కాదు

## చీఫ్ జస్టిస్ పై దాడి న్యాయ వ్యవస్థకే మాయని మచ్చ
## ఈ దాడి దళితులందరి పైన జరిగిన దాడి
## ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



నలగొండ ప్రతినిధి, మేజర్‌న్యూస్ : చీఫ్ జస్టిస్ దళితుడు కాకపోతే ఈ దాడి జరిగేది కాదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. చీఫ్ జస్టిస్ గవాయిపై దాడి న్యాయవ్యవస్థకి మాయని మచ్చ అన్నారు. సోమవారం నల్లగొండ కలెక్టరేట్ ముందు నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో భాగంగా దేశంలో ప్రధాన వ్యవస్థల్లో న్యాయవ్యవస్థ ప్రధానమైనదని,రాజ్యాంగంపై జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు.చీఫ్ జస్టిస్ పై జరిగిన దాడి దళితుల అందరి పైన జరిగిన దాడి అన్నారు.ఈ దేశ ప్రజల మనసుల్లో మన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ట్విట్టర్లో సోషల్ మీడియా లో ఈ జస్టిస్ గవాయి పై దేశ ప్రజలు ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, దాడి పాశవిక దాడిగా అభివర్ణించారని, ఈ దేశ ప్రజలు ఎవరు ఈ దాడిని సహించరని పేర్కొన్నారని చెప్పారు. దాడి జరిగిన సమయంలో చీఫ్ జస్టిస్ తన విధులను యధావిధిగా నిర్వర్తించారనీ, ఎలాంటి క్షణికావేశానికి గురికాకుండా గొప్ప మనసున్న వ్యక్తిత్వాన్ని చాటుకున్నారన్నారు. సుప్రీంకోర్టును నడిపించేది చీఫ్ జస్టిస్ లాంటి వారి పై దాడి చేయడం హేమైన చర్య అన్నారు. ఆ నిందితునిపై కేసు పెట్టకుండా, అరెస్టు చేయకుండా కాలయాపన చేయడం దారుణం అన్నారు. సుప్రీంకోర్టులోనే దాడి జరిగితే దళితులకు ఎక్కడ భద్రత ఉంటుంది. రక్షణ ఎక్కడ ఉంటుందో..ఎవరు చెప్పాలని ప్రశ్నించారు.ఈ అనాగరిక చర్యను ఎమ్మార్పీఎస్ తీవ్రంగా ఖండిస్తుందని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం సమర్పించారు.ఈ ధర్నా కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద నరేష్ మాదిగ,మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకుడు జానకి రామయ్య చౌదరి,మాదిగ ఉద్యోగుల సంఘం జాతీయ నాయకుడు దైదసత్యం మాదిగ, ఎం జె ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గాదే రమేష్ మాదిగ,జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ మాదిగ,ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎరిగి శ్రీశైలం మాదిగ మాదిగ,మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కూరపాటి కమలమ్మ మాదిగ,ప్రధాన కార్యదర్శి తలారి ఏడుకొండలు మాదిగ,బొజ్జ దేవయ్య మాదిగ, మాసారం వెంకన్న మాదిగ, ఎరసాని గోపాల్ మాదిగ,గాదే రాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

## – యాదగిరిగుట్ట రూరల్ సీఐ ఎం.శంకర్ గౌడ్

రాజపేట, మేజర్‌న్యూస్ : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని యాదగిరిగుట్ట రూరల్ సీఐ శంకర్ గౌడ్ అన్నారు. సోమవారం రాజపేట మండల కేంద్రంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు బాగా పెరిగాయని, ఆన్లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. వాట్సాప్‌లో వచ్చే లింకులు ఓపెన్ చేయవద్దని, సోషల్ మీడియా వల్ల జరుగుతున్న ఫ్రాడ్స్, డిజిటల్ అరెస్ట్‌లు అని



కాల్స్ వస్తే సంబంధిత పోలీస్ స్టేషన్లో వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. సీసీ కెమెరాలు, 112 టోల్ ఫ్రీ నెంబర్ యొక్క విశిష్టతను వివరించారు. ముఖ్యంగా యువకులు, విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో నష్టపోతే వెంటనే 1930 ఫిర్యాదు చేయలన్నారు. మైనర్లకు వాహనాలు నడపడానికి ఇవ్వద్దని, ఎవరైనా తల్లిదండ్రులు ఇస్తే వాహనాలు సీజ్ చేసి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అనిల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్



హాలియా, మేజర్‌న్యూస్ : అనుముల మండలం హాలియ మున్సిపాలిటీ పరిధిలోని,అంగడి బజార్ నందు గల సుమంగళి ఫంక్షన్ హాల్‌లో కొంపల్లి వాస్తవ్యులు అయినటువంటి లింగాల లక్ష్మయ్య - లక్ష్మమ్మ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా రిసెప్షన్ వేడుకల్లో హాజరై నూతన వధూవరులు వాణి ప్రసన్న-సురేందర్‌లను ఆశీర్వదించిన బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండన్న ఈ కార్యక్రమంలో తిరుమలగిరి సాగర్ మండలం మాజీ వైస్ యంపిపి యడవెల్లి దిలీప్ కుమార్ రెడ్డి, అనుముల మండలం మాజీ వైస్ యంపిపి తిరుమలనాథ గుడి మాజీ ఛైర్మన్ బుర్రి రామిరెడ్డి, పెద్దవూర మాజీ ఉప సర్పంచ్ మట్టపల్లి ప్రదీప్ రెడ్డి, శిల్గాపురం మాజీ సర్పంచ్ వెంకటేష్ గౌడ్, వెంకన్న, రమేష్ చారి, గజ్జల శివారెడ్డి, అనుముల మురళి, విజయ్, షేక్ అబ్దుల్ కరీం మరియు కొంపల్లి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పాశం గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌ను వీడి బిఆర్ఎస్‌లో చేరిన పలువురు నాయకులు

గుర్రంపోడ్, మేజర్‌న్యూస్ : గుర్రంపోడ్ మండలం చింతగూడెం గ్రామపంచాయతీ శాఖాజిపురం గ్రామానికి చెందిన దేవరకొండ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గంగుల ఓంకారం యాదవ్ పేర్ల వెంకట్ రెడ్డి, అందుగుల లింగయ్య తదితరులు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి సోమవారం పాశంవారిగూడెంలోని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్ రెడ్డి నివాసంలో పాశం గోపాల్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు వారికి పాశం గోపాల్ రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చిన వెన్నంటే ఉండి ఆదుకుంటానని త్వరలో బిఆర్ఎస్ పార్టీలోకి భారీ చేరికలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కూనూరు సైదిరెడ్డి, పోలబోని బిక్షం, పేర్ల జైపాల్ రెడ్డి, అమరవాది ఇస్తారి బోడ సురేష్. చిరబోయిన వెంకటయ్య, అందుగుల వెంకటయ్య, సన్నాల వెంకటయ్య, అమరావతి రమేష్. గిరి సత్తయ్య, ఆరేపల్లి శ్రీశైలం, చిన్న తదితరులు పాల్గొన్నారు.

# తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

చిట్యాల, మేజర్‌న్యూస్ : వర్షాలకు ధాన్యం తడిసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య లు డిమాండ్ చేశారు.చిట్యాల మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సోమవారం నాడు సిపిఎం, రైతు సంఘం ప్రతినిధులు పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన తారుబాళ్ళు,కాంటాలు, హమాలీ లను ఏర్పాటు చేసి,తగిన మౌలిక వసతులు కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఐతరాజు నర్సింహా, సిపిఎం నాయకులు బొబ్బిలి వెంకట్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, బొడ్డు బాబురావు,చిర్రబోయిన శ్రీశైలం,మెండె తిరుమలేష్,రావుల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మండలాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాలి

(మొదటిపేజీ తరువాయి)

అన్ని కేజీబీవీలు, మోడల్ పాఠశాలలను తనిఖీ చేయాలని, అలాగే మండల స్థాయిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పనులను సైతం పర్యవేక్షించాలని చెప్పారు. పూర్వ ప్రాథమిక విద్యకు సంబంధించి నమోదును పెంచాలని డీఈవో బిక్షపతిని ఆదేశించారు. నల్గొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నిర్మిస్తున్న వికలాంగుల ధ్రువపత్రం జారీ కేంద్రం పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని డిఆర్డిఓ శేఖర్ రెడ్డిని ఆదేశించారు. ఇటీవల కాలంలో గుండె జబ్బులతో అనేకమంది మరణిస్తున్నారని, ఇందుకు గాను వైద్య ఆరోగ్యశాఖ ద్వారా జిల్లా వ్యాప్తంగా సిపిఆర్ పై అవగాహన శిబిరాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్‌ను ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ సిపిఆర్ పై అవగాహన కై ఈ నెల 13 నుండి 17 వరకు సిపిఆర్ పై శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతున్నదని, ఆయా శాఖల ద్వారా అవసరమైన వారి పేర్లను పంపిస్తే శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. సిపిఆర్ ప్రాధాన్యత, గుండెపోటు వచ్చినప్పుడు సిపిఆర్ ద్వారా ప్రథమ చికిత్స అందించే అంశంపై రూపొందించిన ప్రతిజ్ఞను సమావేశానికి హాజరైన వారందరితో చేయించారు. ఈ నెల 24 లోగా జిల్లాలో వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలు పంపించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ జిల్లా అధికారులతో కోరారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,ఇన్చార్జి డిఆర్ఓ వై.అశోక్ రెడ్డి, గృహ నిర్మాణ పిడిరాజ్ కుమార్, దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, జిల్లా అధికారులు ఉన్నారు. కాగా ఈ సోమవారం 90 మంది వారి సమస్యల పరిష్కారానికి దరఖాస్తులను సమర్పించగా, అందులో 45 రెవెన్యూ శాఖకు సంబంధించి రాగా, మరో 45 వివిధ శాఖలకు వచ్చాయి.

# కోదాడలో విచ్చలవిడిగా కల్తీ ఆహార పదార్థాల విక్రయం

## ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న హోటల్స్, బేకరీ యజమానులు

## మామూళ్లు తీసుకొని తూతూ మంత్రంగా ఆహార తనిఖీ అధికారుల తనిఖీలు



కోదాడ, మేజర్‌న్యూస్ : కోదాడ పట్టణంలోని హోటళ్లు, బేకరీలు, ఫాస్ట్ ఫుడ్ కేంద్రాల్లో విచ్చలవిడిగా నాణ్యతలేని ఆహార పదార్థాలను విక్రయిస్తు దోపిడీకి పాల్పడుతున్నారు. బేకరీల్లో విక్రయించే ఎగ్ పఫ్, కర్రీ పఫ్ తదితర పదార్థాల్లో పాచిపోయినవి పెట్టి వాటిని వేడి చేసి విక్రయిస్తున్నారు. ఇక ఫాస్ట్ ఫుడ్ కేంద్రాల్లో రోజుల తరబడి మరిగిన నూనెతో నూడిల్స్, ఫ్రైడ్ రైస్, మంచూరియా, తదితర పదార్థాలను తయారు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా పట్టించుకోవాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో తూగుతూ హోటల్లో బేకరీల వాళ్లకు మరింతగా బలం ఇస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. పలు వ్యాపార సంస్థల యాజమానులు ధనార్జనే ధ్యేయంగా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కోదాడ పట్టణంలో వీధికి రెండు మూడు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ఉన్నాయంటేనే అర్థం చేసుకోవాలి పరిస్థితి ఎలా ఉందో. కళాశాలలకు వెళ్లే విద్యార్థులు బేకరీలు, ఫాస్ట్ ఫుడ్ కేంద్రాల వైపు మొగ్గు చూపడంతో దీనిని ఆసరాగా చేసుకున్న వ్యాపారులు ఆహార పదార్థాల తయారీలో ఏమాత్రం నాణ్యత ప్రమాణాలు పాటించకుండా విక్రయిస్తున్నారు. ముఖ్యంగా బేకరీల్లో విక్రయించే ఎగ్ పఫ్, కరీపఫ్ తదితర పదార్థాల్లో పాచిపోయినవి పెట్టి వాటిని వేడి చేసి విక్రయిస్తున్నారు. ఇక ఫాస్ట్ ఫుడ్ కేంద్రాల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. రోజుల తరబడి మరిగిన నూనెతో నూడిల్స్, ఫ్రైడ్ రైస్, మంచూరియా, తదితర పదార్థాలను తయారు చేస్తున్నారు. ఇంజినీరింగ్ కళాశాలలకు రోజుకు వందలాది మంది విద్యార్థులు వస్తుండగా దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు ఇక్కడే హాస్టళ్లు, గదులను అద్దెకు తీసుకుని చదువుకుంటు భోజనం కోసం హోటళ్లు, మెస్లు, ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలపై ఆధార పడతుంటారు. దీంతో ధనార్జనే ధ్యేయంగా భావిస్తున్న వ్యాపారులు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నాసిరకం వస్తువులతో తయారు చేసిన పదార్థాలను విక్రయిస్తున్నారు. ఇక పలు హాస్టళ్లు, హోటళ్లలో విచ్చలవిడిగా కల్తీ నూనెను ఉపయోగిస్తూ ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారు. చాలావరకు ఫుడ్ పాయిజన్ అయి ఆసుపత్రుల పాలైన సంఘటనలు కోకొల్లలు.

**జాడలేని ఆహార తనిఖీలు**

కోదాడ పట్టణంలో విచ్చలవిడిగా నాణ్యతలేని ఆహార పదార్థాలను విక్రయిస్తున్న ప్పటికీ ఆహార తనిఖీ అధికారుల జాడే లేదు. అధికారులు తూతూ మంత్రంగా తని ఖీలు చేస్తూ, నకిలీ ఆహార పదార్థాలు దొరికిన హోటల్ పై చర్యలు తీసుకోకుండా ఫైన్ వేసి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారిందని, దీంతో మరుసటి రోజు నుంచే వ్యాపారులు యధావిధిగా అక్రమాలు చేయడం సహజంగా మారింది అని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఆహారం కల్తీ చేసిన వారిని వెంటనే శిక్షించి వ్యాపారాన్ని సీజ్ చేస్తేనే ఆహారం కల్తీ తగ్గుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**పొంచి ఉన్న ప్రమాదం**

అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకుండా ఉదాసీనతగా వ్యవహరించడం అధికారులకు పరిపాటిగా మారింది. అలాగే పలు హోటళ్లు, మెస్‌లలో కూడా మిగిలిన పదార్థాలను ఫ్రిడ్జ్‌లలో భద్రపరిచి మరుసటి రోజు వేడి చేసి కస్టమర్లకు విక్రయించడం గమనార్హం. ఇలా భోజన తయారీ విషయంలో ప్రమాణాలను పాటించని పక్షంలో ప్రజల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**అమలు కాని కఠిన శిక్షలు**

పరిశ్రభమైన, నాణ్యమైన ఆహారాన్ని ఎవరు తయారు చేసినా, అమ్మినా, నిల్వ చేసినా, సరఫరా చేసినా ఫుడ్ సెఫ్టీ స్టాండర్డ్ యాక్ట్ 2006 చట్టం ద్వారా శిక్షతోపాటు జరిమానా విధిస్తారు. అనుమతి లేకుండా విక్రయిస్తే ఆరు నెలల జైలు, రూ.లక్ష వరకు జరిమానా వేస్తారు. ఆరోగ్యానికి హానికరంగా ఉంటే ఏడాది జైలు శిక్ష, రూ.3లక్షల వరకు పెనాల్టీ ఉంటుంది. తీవ్ర అనారోగ్యానికి గురి చేసే ఆహార పదార్థమైతే 6నెలల జైలు శిక్ష, రూ.5లక్షల వరకు జరిమానా విధిస్తారు. కానీ ఈ శిక్షలు ఎక్కడ అమలవుతున్న దాఖలు మాత్రం లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో తనిఖీలు చేపట్టి కఠిన చట్టాన్ని అమలు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## మండల కేంద్రానికి కిలోమీటర్ దూరంలో

# వైన్ షాపులకు అనుమతి ఇవ్వాలి

## మునుగోడు తాజా మాజీ సర్పంచ్ మిర్యాల వెంకన్న



మునుగోడు, మేజర్‌న్యూస్ : మండల కేంద్రానికి కిలోమీటర్ దూరంలో వైన్ షాపులకు అనుమతి ఇవ్వాలనీ మునుగోడు తాజా మాజీ సర్పంచ్ మిర్యాల వెంకన్న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా, ప్రజల ఆరోగ్యాలు దృష్టిలో ఉంచుకొని మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఊరి చివర భాగాల్లో వైన్ షాపులు నిర్వహించుకోవాలని తెలిపారు. ప్రస్తుతం మండల కేంద్రంలో మహిళల ఆరాధ్య దైవమైన ఎల్లమ్మ గుడికి దగ్గరగా, అంబేద్కర్ విగ్రహానికి కనీస 20 ఫీట్ల దూరంలో ఒక వైన్ షాప్ నడుపుతున్నారని, అలాగే ఎస్సీ కాలనీ అనుకోని ఇంకో వైన్ షాప్ ఉన్నాయన్నారు. దీంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు.మండల కేంద్రంలో వైన్ షాపులు ఉండటంతో సాయంత్రం ఐదు గంటలకు మహిళలు షాపింగ్ గాని, రోడ్డుపైకి రావాలంటే మహిళలు రాలేకపోతూరన్నారు. వైన్ షాప్ లోనే సిట్టింగ్లు ఏర్పాటు చేయడం వలన మహిళలు రోడ్డుపైకి వచ్చే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఇకనైనా ఎక్సైజ్ శాఖ, జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యేలు స్పందించి కొత్త వైన్ షాపులకు టెండర్ వేసే పక్రియలో వైన్ షాప్‌లను ఊరుకు కిలోమీటర్ దూరంలో అనుమతులు వచ్చే విధంగా చూడాలని కోరారు.

# ఎమ్మెల్యే ఆదేశాలతో జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్‌కు వినతి

మునుగోడు, మేజర్‌న్యూస్ : రాష్ట్రవ్యాప్తంగా నూతన వైన్ షాపులకు టెండర్ల ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో సోమవారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పిలుపుమేరకు మునుగోడు నియోజకవర్గంలోని ముఖ్య నాయ కులు నల్గొండ జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ మునుగోడు నియోజకవర్గంలో వైన్‌షాప్ టెండర్లు వేసే వారికి కొన్ని అంశాలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా వైన్ షాపులను దక్కించుకునే వారు ఊరి బయట మాత్రమే వైన్




షాపులను పెట్టుకోవాలని, సిట్టింగు లేకుండా చూసుకోవాలని కోరారు. బెల్ట్ షాపులకు మద్యం విక్రయించొద్దని, వైన్ షాపుల యజమానులు సిండికేట్ గా మారుద్దని తెలిపారు. మద్యాన్ని సాయంత్రం 4:00గంటల నుండి రాత్రి 9:00 గంటలకు మాత్రమే విక్రయించుకోవాలని సూచించారు.ఈ నిర్ణయం ఎవరిని ఇబ్బంది పెట్టడానికి కాదని నియోజకవర్గ ప్రజలు యువత మద్యం మత్తు వదిలి ఆర్థికంగా ఎదగాలనేది ఎమ్మెల్యే కోరిక అన్నారు. ఈ ప్రయత్నం వల్ల ప్రజల ఆరోగ్యం బాగుపడితే వారి జీవన ప్రమాణాలు మెరుగు పడతాయని, ఇంట్లో యజమాని తాగకుండా ఉంటే మహిళలు ఆర్థికంగా సాధికారత సాధిస్తారని అందుకే ఇటువంటి సూచనలు ఎమ్మెల్యే చేశారని తెలిపారు.ఎమ్మెల్యే త్రాగుడికి వ్యతిరేకం కాదని, ఉదయం నుండి సాయంత్రం వరకు అదే పని మీద తాగుతూ తాగుడుకు బానిసలుగా మారుతున్న విధానానికి వ్యతిరేకం అన్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు పనిచేసుకోవాలని దాని తర్వాత తాగుడు గురించి ఆలోచించాలని మునుగోడు నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారనీ తెలిపారు. గ్రామాలలో పర్యటిస్తున్న సందర్భంలో యువత తాగుడుకు బానిసై విచక్షణారహితంగా ప్రవర్తించడం చూశారని, ఎంతోమంది యువకులు 30 ఏళ్ల లోపు వారే తాగుడుకు బానిసై చనిపోతే మహిళలు చిన్నతనంలోనే భర్తను కోల్పోయి ఆ కుటుంబాలు రోడ్డు పాలవుతున్నాయని తమ పిల్లలను పోషించడానికి వారు పడరాని పాట్లు పడుతున్న ఆవేదనలో నుండి వచ్చిన నిర్ణయమే బెల్ట్ షాపుల నిర్మూలన, మద్యం షాపుల సమయాల మార్పు అన్నారు.వినతి పత్రం అందించిన వారిలో మునుగోడు,చండూరు, నాంపల్లి మండలాల ముఖ్య నాయకులు ఉన్నారు.

## భారీ వర్షాల కారణంగా కోనాయిగూడెం-జిన్నాయిచింత

# గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం



గుర్రంపోడ్, మేజర్ న్యూస్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గుర్రంపోడ్ మండలంలో పలు గ్రామాలలో ఆదివారం రాత్రి సుమారు మూడు గంటల పాటు భారీ వర్షం కురవడంతో మండలంలోని అన్ని గ్రామాల్లో చెరువులు, కుంటలు అలుగు పోస్తున్నాయి. పలు గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. కోనాయిగూడెం నుండి జిన్నాయిచింత వెళ్లే రోడ్డు కొట్టుకుపోయింది. కోనాయిగూడెం దగ్గర రాకపోకలకు అంతరాయంగా మారింది,గతంలో ఇక్కడ మరమ్మతుల కోసం అక్కడి ప్రదేశంలో గూనలు ఉంచగా కొందరు దొంగచాటుగా ఆ గూణలను తరలించకుపోయారు, దయచేసి ప్రభుత్వం వెంటనే స్పందించి కోనాయిగూడెం గ్రామ పరిధిలోని కాలువ

**NAME CHANGE**

I,KUMBA KALYANI W/O VANDANAM VIKRANTH, R/O H.NO :- 1-5-97 , STATION ROAD BATTALA BAZAR MAHABUBABAD ,PIN: 506101. HERE BY DECLARE THAT MY PREVIOUS NAME WAS KUMBA KALYANI W/O VANDANAM VIKRANTH ,I HAVE CHANGED MY NAME TO **VANDANAM KALYANI W/O VANDANAM VIKRANTH** I SHALL HENCEFORTH BE KNOWN AS **VANDANAM KALYANI** FOR ALL PURPOSE.

సూర్య
14-10-2025 మంగళవారం

## రోడ్డుపై గుంతలు పూడ్చాలని వెస్ట్ జోన్ వాకర్స్ సభ్యుల నిరసన

### వీధి దీపాలు వెలగడం లేదని చెప్పిన కమిషనర్ పట్టించుకోవడంలేదని ఆగ్రహం

### రోడ్డు వెంట చెత్తతో దుర్వాసన వస్తుందని ఆగ్రహం



కోదాడ, మేజర్‌న్యూస్ : కోదాడ పట్టణంలోని సూర్యాపేట రోడ్డులో విష్ణు రామ్ థియేటర్ ఎదురుగా ఉన్న కట్ట కొమ్ముగూడెం రోడ్డు నుండ బైపాస్ రోడ్డు వరకు గుంటల మయంగా మారి బాటసారిలకు ఇబ్బందికరంగా మారిందని వెస్ట్ జోన్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం గుంతల వద్ద నిరసనను వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా వీధి దీపాలు లేక ఉదయం నడకకు వచ్చే ప్రజలకు ఇబ్బంది కరంగా ఉందని, రోడ్డు వెంబడి చెత్త చెదారంతో దుర్వాసన మధ్య వాకింగ్ చేస్తున్నామని నిరసన వ్యక్తం చేస్తున్నారు. వీధి దీపాలు లేకపోవటం వలన తెల్లవారుజామున వాకింగ్‌కి వెళ్లాలంటే గుంతలు కనపడటం లేదని కుక్కలు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని ఈ విషయమై కమిషనర్‌కు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఆర్ అండ్ బి అధికారులు మరియు మున్సిపల్ అధికారులు స్పందించి గుంటల పూడ్చి వీధి దీపాలు వేసి చెత్త చదవరాన్ని తొలగించవలసిందిగా వెస్ట్ జోన్ వాకర్అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు.

## సమస్యల పై ప్రజా ఉద్యమాలు చేయాలి

### మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



మిర్యాలగూడ టౌన్, మేజర్‌న్యూస్ : గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజా ఉద్యమాలు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో మిర్యాలగూడ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం మండల నాయకులు పిల్లుట్ల సైదులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 నెలలుగా గ్రామాలలో పాలన వ్యవస్థ లేకపోవడంతో అనేక సమస్యలు నెలకొన్నాయని దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలలో పారిశుధ్య వీధి దీపాలు అస్తవ్యస్తంగా మారాయని సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్థానిక సమస్యలు ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పన కోసం గ్రామస్థాయిలో ఉద్యమాలు జరిపి అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల కోసం పోరాటాలు చేసి ఎర్రజెండా అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు మండల కార్యదర్శి రవి నాయక్, జిల్లా కమిటీ సభ్యులు రాగిరెడ్డి మంగారెడ్డి, మండల నాయకులు చౌగాని వెంకన్న, ఉన్నాం వెంకటేశ్వర్లు, సైదమ్మ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## చిన్ననాటి మిత్రుడి కుటుంబానికి చేయూతగా నిలిచిన తోటి స్నేహితులు



ఆలేరు, మేజర్‌న్యూస్ : ఆలేరు మండల పరిధిలోని రాఘవపురం గ్రామానికి చెందిన గౌడ మహిపాల్ ఇటీవల అకస్మాత్తుగా మృతి చెందారు. మహిపాల్ నిరుపేద కుటుంబానికి చెందిన నేపథ్యంలో 1999%-%2000 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన అతని తోటి స్నేహితులు మహిపాల్ కుటుంబాన్ని పరామర్శించి,ఆ కుటుంబానికి చేయూతగా ముందుకు వచ్చి తమ వంతు సహాయంగా స్నేహితులు కలసి రూ.23,000 నగదు, 25 కిలోల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ధైర్యం చెప్పి,భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొంగరి వెంకటేష్, బైరి నగేష్, చంద్రశేఖర్, గుర్రాల మహేందర్, వల్లెపు వెంకటేష్, దర్శనం కృష్ణ, మాసపేట సోమరాజు, పార్వతి రమేష్, దేవరకొండ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన ఆలేరు జూనియర్ కళాశాల విద్యార్థి



ఆలేరు, మేజర్‌న్యూస్ : ఆలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఈ.టి గ్రూప్ విద్యార్థి నీరటి రాకేష్ 69వ పాఠశాల స్థాయి క్రీడల్లో భాగంగా నిర్వహించిన అండర్ 19 వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగింది. భువన గిరిలో జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా వాలీబాల్ పోటీల్లో రాకేష్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ పూజారి వెంకటేశ్వర్లు తెలిపారు. త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నట్టు ఆయన పేర్కొన్నారు. విద్యార్థి రాకేష్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల జిల్లా సెక్రటరీ ప్రసాద్ రావు అభినందనలు తెలిపారు.

## రేపటి బంద్ 18కి వాయిదా

### బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్

మిర్యాలగూడ టౌన్, మేజర్‌న్యూస్ : తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ రేపు బందుకు పిలుపునిచ్చిన బీసీ సంఘాలు 18కి వాయిదా వేయడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి అన్ని బీసీ సంఘాలు. జైఏసి ఏర్పడి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర తరహాలో బీసీల ఉద్యమం ఉండబోతా ఉంది ధర్నాలు, రాస్తారోకోలు, దీక్షలు, రహదారులపై ఉంటా వార్పు కార్యక్రమాలు నిర్వహించేలా జేఏసీ నిర్ణయం తీసుకుంది కాబట్టి తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి బీసీ నాయకులు అందరూ కూడా ఉమ్మడిగా కదం తొక్కి కథలాల్సిన అవసరం ఉందన్నారు బీసీలలో ఉన్నటువంటి అన్ని కుల సంఘాలు



కూడా బయటకి రావాలని ఆయన కోరారు బీసీలకు జరిగే అన్యాయాన్ని ఇప్పుడు ప్రశ్నించకపోతే ఇంకా ఎప్పుడు బానిసల్లానే బ్రతకాల్సి వస్తుందని ఆయన అన్నారు బీసీలకు ఇచ్చిన మాట ప్రకారం స్థానిక ఎన్నికల్లో 42% రాజకీయ రిజర్వేషన్లు రాజ్యాంగం ద్వారా అమలు పొందిన తర్వాతే ఎన్నికల నిర్వహించాలని ఆయన కోరారు పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తే మాత్రం రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో జక్కా నాగేశ్వరరావు, సురేష్ యాదవ్, పట్టేటి రమేష్, సతీష్, రాజారాం, పరమేష్, వంశీ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఇది రహదారా..? నీటి కుంటనా...?



మర్రిగూడ, మేజర్‌న్యూస్ : మర్రిగూడ మేజర్ గ్రామపంచాయతీలో ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే రహదారి రైతు వేదిక వద్ద వర్షపు నీటి నిల్వతో కుంటను తలపిస్తోంది. గత 12 సంవత్సరాలుగా ఈ రహదారి మరమ్మతులకు నోచుకోలేదు. ఎంపీడీవో కార్యాలయం, ఎన్‌ఆర్‌ఈజీఎస్, వెలుగు, వ్యవసాయ, అటవీ, భారత్ గ్యాస్ గోదాము, మానవ హక్కుల భవనానికి, వ్యవసాయదారులు భావిపనులకు వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి గత కొంతకాలంగా సమస్య ఎక్కడ వేసిన గొంగడిలాగా అక్కడే ఉన్నాగాని పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. గత ప్రభుత్వ హయాంలో నాసిరకంతో కూడిన నామమాత్రపు సిసి రోడ్డు వేసి చేతులు దులుపుకున్నారు. ఇటీవల వరుసగా కురుస్తున్న అకాల వర్షాలతో అక్కడ వర్షపు నీరు చేరి మురికికుంటగా మారి విపరీతమైన దుర్వాసన వస్తుంది. అధికారులు బాటసారిలు, వ్యవసాయదారులు గాని ఆ రోడ్డుపై వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వర్షపు నీరు నిల్వ ఉండడంతో పాములు, తేళ్లు పక్కనే ఉన్న కాలనీ ఇంటిలోకి వస్తున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యాత్మకంగా ఉన్న ఈ రహదారిని శాశ్వత మరమ్మతులు చేయించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కాలనీవాసులు అటు బాటసారులు కోరుతున్నారు.

## సోనీ ఫోటో వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

### –ఫోటో వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రోజు యజ్ఞమా చారి

చౌటుప్పల్, మేజర్ న్యూస్ః ఈ నెల 14న భువనగిరిలోని చాణిక్య గ్రాండ్ హోటల్‌లో జరిగే సోనీ ఫోటో వర్క్‌షాప్‌ను, ఫోటో , వీడియో గ్రాఫర్స్ సద్వినియోగం చేసుకోవాలని ఫోటో వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రోజు యజ్ఞమా చారి అన్నారు. రోజురోజుకు మారుతున్న ఫోటో టెక్నాలజీని జిల్లా ఫోటోగ్రాఫర్స్ కోసం విజ్ఞానం పెంచే విధంగా సోనీ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సంక్షేమ సంఘం అధ్యక్షుడు హుస్సేన్, ప్రధాన కార్యదర్శి రవి, కోశాధికారి మాధవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు బోగ చంద్రశేఖర్‌తో పాటు ముఖ్య నాయకులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



తుంగతుర్తి, మేజర్‌న్యూస్ ః ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మందుల సామెల్ రైతులను కోరారు. సోమవారం మండల కేంద్రం, అన్నారంలోని ఐకెపి సెంటర్లను ప్రారంభించి మాట్లాడారు. ధాన్యంలో తేమ శాతం 17కి మించకుండా ఉండాలని బాగా ఎండబెట్టి తాలు మట్టి లేకుండా ఉండే విధంగా చూడాలని తూకం వేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ కాగానే 24 గంటల్లో రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తారని తెలిపారు. ఏ గ్రేడ్ మద్దతు ధర 2389 రూపాయలు, సాధారణ రకం 2369 రూపాయలు, సన్నరకం ధాన్యంకు అదనంగా బోనస్ 500 రూపాయలు ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దయానందం, డిసిసిబి డైరెక్టర్ గుడిపాటి సైదులు, సొసైటీ మాజీ సిఈఓ వందనపు వెంకటేశ్వర్లు, సిఈఓ యాదగిరి, పిఏసిఎస్ చైర్మెన్ మోడెం శ్రీలత ఉపేందర్, తుంగతుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ చింతకుంట్ల వెంకన్న, రామాలయం చైర్మెన్ సంజీవ, అన్నారం గోపాలమిత్ర పోగుల శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు కేతిరెడ్డి రవిందర్‌రెడ్డి, మజీద్, యాకయ్య, భిక్షంరెడ్డి, రామచంద్రు, పెండె యాదగిరి, ఎండ్ల మల్లయ్య, మహిళా సంఘాల నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**అడ్డగూడూర్ :** రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు



చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నారు. అడ్డగూడూర్ మండల కేంద్రంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే సామెల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పనిచేసే రైతును ఐకెపి నిర్వాహకులు, మిల్లర్లు అధికారులు ఇబ్బందులకు గురి చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ధాన్యంలో తేమశాతం 17కు మించకుండా ఉండాలని ధాన్యాన్ని ఆరబెట్టి తాలు మట్టి లేకుండా ప్రభుత్వం నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలోనే అమ్ముకోని మద్దతు ధర పొందాలన్నారు. ఏ గ్రేడ్ రకానికి క్వింటాకు 2389 రూపాయలు, బి గ్రేడ్ రకానికి క్వింటాకు 2369 రూపాయలు, సన్న ధాన్యానికి అదనంగా 500 రూపాయలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో పిడి నాగిరెడ్డి, ఏవో పాండురంగచారి, ఏఈఓ దయాకర్, మోత్కూర్ మార్కెట్ చైర్మెన్ నూనెముంతల విమల, వైస్ చైర్మెన్ లింగాల నర్సిరెడ్డి, డైరెక్టర్ బాలెంల విద్యాసాగర్, ఏపిఎం కళావతి, విఓఏ వీరలక్ష్మి, వినోద, సిసిలు యాదయ్య, ప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**మోత్కూర్ :** రైతులు పండించిన వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి వారి చేతిలో మోసపోవద్దని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ అన్నారు. సోమవారం మోత్కూరు మార్కెట్ యార్డులో పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం నిర్వహించే కొనుగోలు కేంద్రాలలోనే తమ ధాన్యాన్ని అమ్మి, ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర క్వింటాకు రూ 2389 ధరను పొందాలని కోరారు. అనంతరం మండలంలోని పాటిమట్ల గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే



ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి.జ్యోతి, పిఏసిఎస్.చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నూనేముంతల విమల, వెంకటేశ్వర్లు గౌడ్, ఏ.పీ.ఐ. డి.సి మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరి రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పైళ్ల సోమిరెడ్డి, మండల అధ్యక్షులు వంగాల సత్యనారాయణ, పట్టణాధ్యక్షుడు గుండగోని రామచంద్రు గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మహమ్మద్ సమీర్, పన్నాల శ్రీనివాస్ రెడ్డి, సీఈవో వరలక్ష్మి, యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ కార్యదర్శి మందుల సురేష్, బయ్యాని రాజు, మెంట నగేష్, పాలోజు శేఖరా చారి, బండారు వెంకట్ రెడ్డి, ఐకెపి సిబ్బంది పాల్గొన్నారు.

**నూతనకల్ :** రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించేందుకే ప్రభుత్వం



ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కోరారు.ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాకు రూ. 2389, బి గ్రేడ్ ధాన్యానికి క్వింటాకు రూ. 2369 ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ నాగం జయసుధసుధాకర్ రెడ్డి, తహసిల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీత, వ్యవసాయ అధికారి మల్లారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగం సుధాకర్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి బుసిగంపల జాన య్య, సాయి ప్రసాద్, నాయకులు గుగులోతు కృష్ణనాయక్, పాల్వాయి నాగరాజు, కట్ట మల్లారెడ్డి, పసుల అశోక్ యాదవ్, బొడ్డుపల్లి అంజయ్య, నకిరేకంటి వెంకన్న, ఏపిఎం వెంకటరెడ్డి, సిసి సునీత, వివోఏలు కందుకూరి భాగ్యలక్ష్మి, కళ్లెం సునీత, అధ్యక్షురాలు గోపగాని సరిత, రైతులు తదితరులు ఉన్నారు.

**చౌటుప్పల్ :** పట్టణ కేంద్రంలో సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి



స్థానిక మార్కెట్ యార్డులో ధాన్యం త డిసింది. మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని వ్యవసాయ మార్కెట్ క మిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. తడిసిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొననుగోలు చేస్తుందని ఎవరు అధైర్యపడోద్దని రైతులకు సూచించారు. ఆయనతో పాటు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, వీరమల్ల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

**చౌటుప్పల్ :** రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ, ఐకెపి సహకార సంఘాల కొనుగోలు కేంద్రాల్లోని పంటలను విక్రయించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య సూచించారు. రైతులు ప్లే స్టోర్లో "కపాస్ కిసాన్" యాప్ డౌన్లోడ్ చేసుకోని స్లాబ్ బుక్ చేసుకుని సిసిఎస్ ద్వారా అమ్మకాలు చేయాలని కోరారు. లైసెన్సు లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్న రైస్ మిల్లర్లు దళారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



హుజూర్‌నగర్‌రూరల్,మేజర్‌న్యూస్ః మండల పరిధిలోని లక్కవరం గ్రామంలో యూపిఎస్ పాఠశాలలో 7వ తరగతి వరకు చదవిన చిన్ననాటి మిత్రులు తమ తోటి స్నేహితుడు అయిన అనుములగూడెం గ్రామానికి చెందిన షేక్ సైదులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. సోమవారం చిన్ననాటి మిత్రులు షేక్ సైదులు భార్యకు రూ.30 వేల ఆర్థిక సహాయం అందచేశారు.కార్యక్రమంలో చామకూరి నరసింహా రావు, ఉపేందర్,రమేష్,మధుచారి,గోపయ్య, అబ్దుల్,రహీం, బాలసైదులు, గురవయ్య, నాగరాజు పాల్గొన్నారు.

# బ్యూటీ పార్లర్ ప్రారంభించిన ఎమ్మెల్యే



మిర్యాలగూడ టౌన్, మేజర్‌న్యూస్ : మిర్యాలగూడ పట్టణం రెడ్డి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన వేద శ్రీ బ్యూటిపార్లర్‌లి ప్రారంభించిన శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ కౌన్సిలర్ దేశిడి శేఖర్ రెడ్డి ఈ సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ తాజా ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబం పోషకాహారం తీసుకునే అలవాటు పెంపొందించుకోవాలి

## ఐసిడిఎస్ సూపర్‌వైజర్‌లు శివేష, నాగమణి





మునుగోడు, మేజర్‌న్యూస్ : ప్రతి కుటుంబం పోషకాహారం తీసుకునే అలవాటు పెంపొందించుకోవాలనీ ఐసిడిఎస్ సూపర్వైజర్‌లు మెడబోయిన శివేష, మిరియాల నాగమణిలు అన్నారు. సోమవారం మండలములోని గంగోరీగూడెం, ఊకోండి, లక్ష్మీదేవిగూడెం గ్రామాలలో పోషణ మాసం కార్యక్రమాన్ని సంఘం బంధం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు హాజరై మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, పిల్లలు కాలానుగుణంగా దొరికే కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు తీసుకోవడం వలన రక్తహీనత రాకుండా కాపాడుతుందని సూచించారు. పోషక విలువలు గురించి అవగాహన కల్పించారు. సిరి ధాన్యాల, చిరు ధాన్యాల వాడడం వలన బీపీ, షుగర్, క్యాన్సర్ రాకుండా జాగ్రత్త పడవచ్చునీ వివరించారు. అనంతరం ఊకోండి హైస్కూల్‌లో పిల్లలకు పోషకాహారం గురించి వివరించి, వ్యాసరచన పోటీ నిర్వహించి గెలిచిన విద్యార్థినీలకు ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీసీ కోరే యాదయ్య, విఓఏ బాలావతి, ఉపాధ్యాయులు లింగస్వామి, రామ్మూర్తి, స్నేహలత, నాగరాజు, నరేష్, కృష్ణయ్య, ఉప్పలయ్య, అంగన్వాడీ టీచర్స్ మంజుల, లింగమ్మ, సుమలత, సైదమ్మ, ఉమా రాణి,అంగన్వాడి ఆయాలు, ఆశాలు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

## ఎస్పీ నరసింహ

సూర్యాపేట, మేజర్‌న్యూస్ ః పోలీస్ గ్రీవెన్స్‌లో వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడి వారి ఫిర్యాదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ బాధితులకు అండగా ఉండాలని సూచించారు. అత్యవసర సమయంలో డయల్ 100 , పోలీస్‌కంట్రోల్ రూం 8712686057 నెంబర్‌కు ఫోన్ చేసి పోలీసు సేవలను పొందాలన్నారు.

# దేవాలయంలో నూతనంగా నిర్మించిన షెడ్డు ప్రారంభం



చింతలపాలెం,మేజర్‌న్యూస్ః మండల కేంద్రంలోని శ్రీ ఉమామహేశ్వర ఆంజనేయస్వామి దేవాలయంలో భక్తుల సౌకర్యార్ధం నూతనంగా నిర్మించిన షెడ్డును ఆలయ చైర్మన్ అంబటి రామకృష్ణారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.7లక్షలతో భక్తుల సౌకర్యార్ధం షెడ్డును నిర్మించామని,భవిష్యత్తులో ఆలయ అభివృద్ధికి మరిన్ని పనులు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నందిరెడ్డి ఇంద్రారెడ్డి,మోర్తాల సీతారెడ్డి, కాకునూరి హనిమిరెడ్డి, గురుస్వామి, వీరంరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఆలయ అర్చకులు శాండిల్, దొండపాటి వెంకటరెడ్డి, తోడేటి మహాత్యం, చిత్తలూరి వీరబాబు, జంగల పుల్లయ్య, అంబటి రంగారెడ్డి, కాకునూరి రామిరెడ్డి, కారింగుల హుస్సేన్,లింగరాజు,వాంకుడోతు హుస్సేన్, ఆలయ సభ్యులు వీరస్వామి,ఎగుటి నాగరాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# సకాలంలో పశువులకు అందని వైద్యం

## – పర్మినెంట్ పశువైద్య డాక్టర్‌ను నియమించాలి



పాలకవీడు,మేజర్ న్యూస్ః పాలకవీడు మండలం కృష్ణా,మూసి పరివాహక ప్రాంతమంత విశాలమైన ఆటవీప్రదేశం ఎక్కువగా ఉండటంతో ఇక్కడ ఎక్కువగా ప్రజలు వ్యవసాయంతో పాటు పశుపోషణ బర్రెలు, గొర్రెలు,మేకలు ప్రత్యామ్నాయ ఆదాయంగా కలిగి ఉంటారు.మండలంలో 22 గ్రామపంచాయతీలు ఉన్న ఇక్కడ పశువుల డాక్టర్ లేకపోవడంపై ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.మండల కేంద్రంలో, జాన్‌పహాడ్ రెండు చోట్ల పశువుల దవాఖానాలు ఉన్నాయి.ఈ రెండు చోట్ల సీనియర్ కాంపౌండర్, అటెండర్‌లతోనే సంవత్సరకాలంగా గడుపు తున్నారు.గత ంలో ఉన్న డాక్టర్ శ్రీకాంత్ వెల్లిన దగ్గర నుండి ఇంత వరకు డాక్టర్‌ను నియమించక పోవడంతో సకాలంలో పశువులకు వైద్యం అందకపోవడంతో డాక్టర్‌ను నియమించాలని ప్రజలు వేడుకొంటున్నారు. అధిక వర్షాల వలన పశువులకు గాలికుంటు వ్యాధులు,మూతివాపు వ్యాధులు వచ్చి జీవాలు చనిపోతున్నాయని గొర్రెల కాపరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మండలంలో ఒక్కొ గ్రామంలో మెడికల్ క్యాంపులు పెట్టి పశు వులకు టీకాలు వేయాలని గొర్రెల కాపరులు కోరుతున్నారు.

**పశుశైద్య సిబ్బంది విధుల పట్ల పర్యవేక్షణ కరువు**

ప్రస్తుతం ఉన్న సీనియర్ కాంపౌండర్, అటెండర్‌లు ఉదయం 10 గంటలకు వచ్చి 2 గంటలకే వెళ్తున్నారని డాక్టర్ లేకపోవడంతో వీరిని పర్యవేక్షణ చేసేవారు లేకపోవడంతో వారు అందుబాటులో ఉండటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.సరైన సమయానికి పశువైద్యశాలకు పశువులను తీసుకవచ్చిన మందులు లేవు అని, రాసిఇస్తా తెచ్చుకో అని, డబ్బులు ఇవ్వు నేను రేపు తెచ్చి వేస్తాను అని డబ్బులు వసూలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

## కోళ్ళఫారంలోకి వర్షపు నీరు

# 6వేల కోళ్ళ మృత్యువాత



చౌటుప్పల్, మేజర్ న్యూస్ః యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలంలో సోమవారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షానికి తీవ్ర నష్టం వాటిల్లింది. పెద్దకోండూరు గ్రామ పంచాయతీ నక్కలగూడెంలోని కోళ్ళ ఫారంలోకి భారిగా వర్షపునీరు చేరింది. దీంతో సుమారు 6వేల కోళ్ళు నీటమునిగి మృతిచెందినట్లు కోళ్ళఫారం యజమాని యాదిరెడ్డి తెలిపారు. మరోవైపు మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున వరి, పత్తి పంటలు నీటమునగడంతో రైతులకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

# నీట మునిగిన పెద్దకొండూరు గ్రామ సచివాలయం, ఇండ్లలోకి వరద నీరు

## –సహాయక చర్యలు చేపట్టిన గ్రామ ప్రజలు




చౌటుప్పల్, మేజర్ న్యూస్ః మండలంలో సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి పెద్దకొండూరు గ్రామంలో ప్రజట ఇండ్లలోకి వరద నీరు రావడంతో ఇండ్లలోని సామగ్రి బియ్యం పాడైపోయాయి. పశువుల దావఖానలో వరద నీరు వెళ్ళి వంట సామాగ్రి అంతా నీట మునిగింది. గ్రామపంచాయతి కార్యలయంలోకి నీట మునగడంతో ఫైల్స్ చెడిపోయాయి. తక్షణమే గ్రామ పంచాయతీ సిబ్బంది స్పందించి గ్రామ కార్యదర్శి, గ్రామ పెద్దలు అందరూ కలిసి జక్కిడి రామిరెడ్డి ఇంటి వద్ద ఉన్నటువంటి మోరికి అడ్డుగా ఉన్న చెత్తను జెసిబి సహయంతో తోలగించి నీరు మరలించారు. భారీ వర్షాలు ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశించారు.

# అధికారులు.. ఆరోపణలు...!

## పోలీసు శాఖలో పలువురు అధికారుల నిర్లక్ష్యం

## నేరుగా జిల్లాస్థాయి అధికారులను కలుస్తున్న ప్రజలు

## పలువురు ఎస్సైల స్థానచలనానికి రంగం సిద్ధం..?

సూర్యాపేట ప్రతినిధి, మేజర్‌న్యూస్ : విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు జవాబుదారిగా ఉండాల్సిన పలువురు పోలీసు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవరహిస్తూ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో ఒక్కొక్కొటిగా పలు అంశాలు బయటకు రావడంతో జిల్లాలోని కొందరు అధికారులపై వేటుపడే అవకాశం ఉందని జిల్లా పోలీసు శాఖలో చర్చ జరుగుతుంది. అయితే ఈ వ్యవహారంలో కొందరు అధికారులు ఉన్నతాధికారులకు తప్పుడు సమచారం ఇచ్చి.. తమ పబ్బం గడుపుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి. అయితే వీటన్నింటిపై పోలీస్ బాస్ ఎలా స్పందిస్తారనేది ప్రస్తుతం చర్చానీయాంశంగా మారింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న పలువురు పోలీసు అధికారులు తమ బాధ్యతలను విస్మరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా పలువురు ఎస్సైలు తమ ప్రాంతాల్లో పోలీస్‌స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల అమర్యాదగా మెలుగుతూ.. సివిల్ పంచాయితీల్లో తలదూరుస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదులు చేసిన సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదని.. న్యాయం కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు ఉన్నతాధికారులను ఆశ్రయించడం గమనార్హం.

**జిల్లాను వీడలేకపోతున్నారు..**

జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పనిచేసిన, పనిచేస్తున్న ఎస్సైలు ఈ జిల్లాలోనే పోస్టింగ్‌లు మార్చుకుంటూ ఇక్కడే పనిచేస్తున్నట్లు బహిరంగ ఆరోపణలు వస్తున్నాయి. పెద్దస్థాయి అధికారులకు, ప్రజాప్రతినిధులకు దగ్గరగా ఉన్నవారు తమకు అనుకూలంగా ఉండే పోలీస్ స్టేషన్లకు బదిలీ చేయించుకుంటున్నారని తమకు నచ్చని వారిని జిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీ చేస్తున్నారని పోలీసు శాఖలో చర్చ జరుగుతుంది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు పోలీస్‌స్టేషన్లలోని ఎస్సైలను బదిలీ చేసేందుకు బాస్ సిద్ధమైనట్లు తెలిసింది. అయితే బదిలీలు ఇప్పుడే ఉంటాయా..? ఎన్నికల తర్వాత ఉంటాయా..? అనేది వేచిచూడాలి.

**ఆరోపణలు ఇలా..**

ఓ పోలీస్‌స్టేషన్ పరిధిలోవాహనాల తనిఖీ సందర్భంగా ఎస్సై నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు సమాచారం అందింది.

మరో పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసులు నమోదైన సమయంలో నింధితులను రిమాండ్‌కు పంపడంతో పాటు అతడి వద్ద ఎస్సై డబ్బులు తీసుకున్నట్లు జిల్లా పోలీస్ అధికారికి ఫిర్యాదు అందింది.

జిల్లాలోని ఓ పోలీస్‌స్టేషన్‌కు ఎస్పీ ఆకస్మిఖ తనిఖీచేసిన సమయంలో ఎస్సై నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పోలీస్‌బాస్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

ఓ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న అధికారి రాజకీయ నాయకుల మాట విని తమకు న్యాయం చేయడం లేదని బాధితులు ఎస్పీకి ఫిర్యాదు చేయగా.. ఆ ఎస్సైని పిలిపించి మందలించినట్లు సమాచారం.

ఇటీవల ఓ పోలీస్‌స్టేషన్‌కు ఎస్సైగా బదిలీపై వెళ్లిన అధికారి తమ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు ప్రజలకు జవాబుదారిగా ఉండడం లేదని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా విచారణ జరుపుతున్నట్లు తెలిసింది.

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పని చేసిన ఓ ఎస్సై వివాదాస్పదుడిగా ఆరోపణలు ఎదుర్కొని ఇటీవల బదిలీ అయిన స్టేషన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్నట్లు ఎస్పీకి ఫిర్యాదురాగా చర్యలకు సిద్ధమైనట్లు సమాచారం. అయితే ఈ ఎస్సై ఇప్పటికే జిల్లా, రాష్ట్రస్థాయి ప్రజాప్రతినిధులకు జోరుగా పైరవీలకు తెరలేపినట్లు సమాచారం.

# మహా మంచిమాట

కులం అడ్డుగోడలు – మతం నిలువు గోడలు మనిషి జీవితాన్ని ఛిద్రం చేస్తున్న సమాజం మనది. తమ కులానికి చెందని వారిని, తమ మతం కానివారిని ప్రేమించినందుకు, పెండ్లాడినందుకు సొంత బిడ్డల్ని సైతం నిర్ధాక్షిణ్యంగా నరికి చంపుతున్న దుస్థితి. ఈ నేపథ్యంలో బుధవారంనాడు సర్వోన్నత న్యాయస్థానం కుల, మతాంతర వివాహాలపై వెలువరించిన అభిప్రాయం అక్షరాలా అనుసరణీయం. ”కులాంతర, మతాంతర వివాహాలకు వ్యతిరేకం కాదు. అలాంటి వివాహాలవల్ల ’సమాజవాదం’ బలపడుతుంది. హిందూ–ముస్లిమ్ వివాహాలు కూడా ఆమోదయోగ్యమే. చట్టప్రకారం ఒకరినొకరు పెండ్లాడితే సమస్య ఏముంటుంది. కులాల అంతరాలు కూడా తొలగిపోతే మంచిదే. ఉన్నత కులాలు, నిమ్న కులాలుగా చెప్పుకుంటున్నవాళ్లు పెండ్లిండ్లు చేసుకుంటే మరింత మేలు” అని జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ ఎం.ఆర్.షాలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఛత్తీస్‌ఘఢ్‌కు చెందిన హిందూ యువతిని ముస్లిం యువకుడు హిందూ మతంలోకి మారి పెండ్లి చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ ఆమె తండ్రి హైకోర్టును ఆశ్రయించగా, హైకోర్టు ఆ ఇద్దరూ కలిసి జీవించవచ్చునని తీర్పునిచ్చింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ అమ్మాయి తండ్రి సుప్రీం కోర్టును ఆశ్రయించగా ఈ కేసును విచారించేందుకు ధర్మాసనం అంగీకరించలేదు. ఈ కేసు విచారణ జరపబోమని స్పష్టం చేస్తూ ”ఆమె ప్రయోజనాలు కాపాడాలని తాము కోరుకుంటున్నామని, ఆ యువతిని బాగా చూసుకోవాలని, నమ్మకమైన భర్తగానేకాక గొప్ప ప్రేమికునిగా మసలుకోవాలని” కోర్టు అతనికి సూచించింది.

భారత రాజ్యాంగం, చట్టం ఏనాడూ కుల, మత వివక్షలను అంగీకరించలేదు. వ్యక్తులు ఏ మతం నుంచి ఏ మతంలోకైనా మారే స్వేచ్ఛను, అలాగే ఏ మతం, కులంవారినైనా వివాహమాడే అవకాశాన్ని కల్పించింది. ఇందుకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకునేవారిని శిక్షించేందుకు కఠిన చట్టాలు కూడా తయారు చేసింది. అయితే చట్టం కన్నా విశ్వాసం ముఖ్యమని భావించేవాళ్లు, రాజ్యాంగం కన్నా మనుధర్మం ఉత్తమమని నమ్మేవాళ్లూ మాత్రం చట్టాలను చట్టుబండలు చేసి మానవత్వాన్ని మంటగలుపుతున్నారు. మత విశ్వాసం, కులహౌదా చుట్టూ అల్లబడిన మాయ (మిత్)కు లోనై, ’స్థాయి’ (స్టేటస్)కు బందీలై తమ కులం కలుషితం కాకుండా, మతం మలినం కాకుండా కాపాడుకోవాలన్న ’అహం’తో ఆలోచనలు కమ్మేయగా తమవేలితో తమ కండ్లనే పొడుచుకుంటున్నారు.

మానవత్వం ఉన్న తల్లిదండ్రులు, తోబుట్టువులు ఎవరైనా తాము అల్లారుముద్దుగా కనిపెంచుకున్న తమ రక్తం పంచుకు వుట్టిన వాళ్ళు పచ్చగా పది కాలాల పాటు బతకాలనుకుంటారు. అందుకు ఎంతో శ్రమిస్తారు. అయితే వివాహం విషయంలోకి వచ్చేసరికి తమ ఆచారాలను పాటించని తమ పిల్లల ఎడల హంతకులుగా మారిపోతారు. తమ పిల్లలను వివాహమాడే వ్యక్తులకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ, వారి దాంపత్య జీవితం సాఫీగా, సుఖవంతంగా సాగిపోతుందన్న నమ్మకమున్నప్పటికీ కేవలం కులం, మతం కారణంగా వారి వివాహాన్ని అడ్డుకుంటారు, వారిని అంతమొందించే దుస్థితికైనా దిగజారుతారు. దిగజారుతున్నారు కూడా. మన దగ్గర ప్రణరు ఉదంతం నుంచి.

# డీసీసీ అధ్యక్షుడి ఎంపిక పారదర్శకంగా జరుగుతుంది

## జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం

## హాజరైన ఏఐసీసీ పరిశీలకులు, జిల్లా ఇంచార్జి శరత్ రౌత్

సూర్యాపేట ప్రతినిధి, మేజర్‌న్యూస్ : జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని ఏఐసీసీ పరిశీలకులు, జిల్లా ఇంచార్జి శరత్‌రౌత్ అన్నారు. ఏఐసీసీ నాయకులు రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు పారదర్శకంగా సూర్యాపేట జిల్లా కాంగ్రెస్‌అధ్యక్షుడిని ఎంపిక చేసేందుకు సంఘటన్ సజన్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని మీడియాలో విస్తతంగా ప్రచారం కల్పించాలని ఆయన అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమం మొదటగా గుజరాత్‌లో విజయవంతంగా నిర్వహించిన మధ్యప్రదేశ్, ఉత్తరఖాండ్, పంజాబ్, ఝార్ఖాండ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో పార్టీ శ్రేణుల అభిప్రాయాలు సేకరించి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. పార్టీ కోసం లాభాపేక్ష లేకుండా పనిచేసే వారిని పార్టీ అభివద్ధి కోసం పనిచేసే వారిని ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది కాబటి పార్టీని పటిష్టం చేసే విధంగా డీసీసీ అధ్యక్షుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అద్యక్షులు చెవిటి వెంకన్నయాదవ్, టూరిజం కార్పొరేషన్ చైర్మన్‌పటేల్ రమేష్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొపవవేణారెడ్డి, వైస్ చైర్మన్‌గట్టు శ్రీనివాస్, చకిలం రాజేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అనురాధ, తండు శ్రీనివాస్‌యాదవ్, అంజద్‌అలీ, అభినయ్, అబ్దుల్‌రహీం, డాక్టర్ వూర రాంమూర్తియాదవ్, బెంజారపు రమేష్, పొలగాని బాలుగౌడ్, నాగుల వాసు, సాయినేత, కరుణాకర్‌రెడ్డి, అయూబ్‌ఖాన్, వెలుగు వెంకన్న, వల్దాసు దేవేందర్, ఎడ్ల వీరమల్లుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల కోసం

# చివరి ఊపిరి వరకు పోరాడిన నాయకుడు చింతకింది వెంకటేష్

ఆలేరు, మేజర్‌న్యూస్ : ఆలేరు పట్టణ కేంద్రంలో చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షులు చింతకింది వెంకటేష్ 6 వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో వెంకటేష్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ చేనేత కార్మికుల హక్కుల కోసం చివరి వరకు పోరాడిన నాయకుడు చింతకింది వెంకటేష్ అని, ఆయన సేవలు చేనేత కార్మిక వర్గం మరువలేనివని పేర్కొన్నారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగుతూ పద్మశాలి సామాజిక వర్గం, చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ధృడ నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని వక్తలు స్మరించారు. ఈ సభకు చింతకింది రామానుజం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆలేరు మాజీ సర్పంచ్ చింతకింది మురళి మాట్లాడుతూ చింతకింది వెంకటేష్ నమ్మిన సిద్ధాంతాల పట్ల రాజీ పడకుండా చివరి ఊపిరి ఉన్నంత వరకు చేనేత కార్మికుల కోసం కృషి చేశారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం మనందరి బాధ్యత అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇప్టు రాష్ట్ర నాయకులు రాచకొండ జనార్ధన్,పద్మశాలి సంఘం జిల్లా నాయకులు ఆడెపు బాలస్వామి, మాజీ కౌన్సిలర్ బేతి రాములు,గుజ్జ అశోక్,బింగి నర్సింహులు, అంకం మల్లేష్, రేగోటి వెంకటేష్,రచ్చ సత్యనారాయణ,చింతకంది మార్కండేయ, ఎలగందుల యాదగిరి, గుజ్జ వెంకటేష్, కుటుంబ సభ్యులు చింతకింది సత్యనారాయణ, చింతకింది సిద్దులు, రాచర్ల నర్సింహులు, భోగ సంతోష్ పాల్గొన్నారు.



# రైతులకు మనోధైర్యం కల్పించిన ఎమ్మెల్యే వేముల

## - తడిసిన ప్రతి గింజ ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

## - రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే వేముల వీరేశం



రామన్నపేట, మేజర్‌న్యూస్ : తడిసిన ప్రతి గింజ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షాల కారణంగా గ్రామాలలో మార్కెట్లో తడిసిన వరి ధాన్యంను సోమవారం మండలంలోని దుబ్బాక, మునిపంపుల, పల్లివాడ గ్రామాలలో పరిశీలించి, రైతులు ఎవరు అధైర్య పడవద్దని, రైతులకి మనోధైర్యం కల్పించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు జరిగే వరకు రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రభుత్వపరంగా ధాన్యం కొలువులను వేగవంతం చేసే విధంగా చూస్తామన్నారు. రానున్న రోజులలో వర్షాలు ఎక్కువ ఉన్న వాళ్ళ రైతులు కోసిన ధాన్యమును జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.

## విద్యాశాఖ ఆదేశాలను బేఖాతర్ చేసిన

# ఉపాధ్యాయుని పై చర్యలు తీసుకోవాలి

## ఎస్ఎఫ్ఐ నాయకులు



తిరుమలగిరి సాగర్, మేజర్‌న్యూస్ : విద్యాశాఖ ఆదేశాలను బేఖాతారు చేసిన ఉపాధ్యాయుని పై చర్య తీసుకోవాలని, అక్రమంగా డిప్యూటేషన్ పై చండూరు మండలానికి వెళ్ళిన ఉపాధ్యాయురాలని వెనక్కి పంపించాలని, భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నాగార్జునసాగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నల్గొండ డీఈఓ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, కార్యదర్శి ఖమ్మంపాటీ శంకర్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ టీచర్లుకు పదోన్నత్తులు కల్పించి బదిలీలు చేసినప్పుడు అక్కడ ఖాళీ అయినా ప్లేస్‌లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాల్సిన అవసరం ఉన్నదని, అల్వాల తండా పాఠశాలలో విద్యార్థులు లేకపోవడంతో పాఠశాలను మూసివేశారు. మూసివేసిన పాఠశాలలో రెగ్యులర్ టీచర్‌గా పని చేస్తున్న ఉపాధ్యాయుడు సైదిరెడ్డిని, బదిలీలలో ఖాళీ అయిన ఎల్లాపురం పాఠశాలకు డిప్యూటేషన్ పై వెళ్లాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు పంపారు. ఆదేశాలను బేఖాతార్ చేసిన ఉపాధ్యాయుని పై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం నుండి వేతనం తీసుకుంటూ మారుమూల ప్రాంతానికి వెళ్లకపోవడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులకి చదువులు దూరం చేస్తున్నారన్నారు. అదేవిధంగా మండలంలో ఉపాధ్యాయుల కొరత ఉండగా సుంకుశాల తండా నుండి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి ఉత్తర్వులు లేకుండా ఉపాధ్యాయురాలు నవ్య, చండూరు మండలానికి డిప్యూటేషన్ పై వెళ్లిన ఇక్కడినుండే జీతం చేయడం గమనార్హం. తక్షణమే వారి జీతభత్యాలు చేయకుండా వారిని వెనకకు తీసుకొచ్చే విధంగా విద్యాశాఖ అధికారులు కృషి చేయాలని కోరారు. నెల్లికలు పాఠశాలకు శాలిగౌరారం నుండి వచ్చిన ఒక ఉపాధ్యాయుడికి డిప్యూటేషన్ వేసి, సుమారు నాలుగు నెలలు డ్యూటీ సర్టిఫికేట్ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న అక్రమాలను చూసి చూడనట్టు వ్యవహరిస్తూ, అవినీతికి సహకరిస్తున్న విద్యాశాఖ అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ బడులను అభివృద్ధి పరుచుట కోసం జిల్లావిద్యాశాఖ అధికారులు వీటన్నిటిపై సమగ్ర విచారణ చేసి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు కోరే రమేష్, సహాయ కార్యదర్శి మారపాక కిరణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# అందాల బుగ్గ మరో నయాగరా...!

## కొండల నడుమ పరవళ్ళు తొక్కుతున్న జలపాతం





మర్రిగూడ, మేజర్‌న్యూస్ : ప్రకృతి ప్రేమికులను కనువిందు చేసే చుట్టూ కొండలు దట్టమైన అడవుల మధ్య కనులకు విందు చేసే కమనీయమైన దృశ్యాలతో జలపాతం ఉంటే మనసుకు చాలా ప్రశాంతంగా ఉంటుంది. నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడ్డది మర్రిగూడ మండలం. అయితేనే ప్రకృతి అందాలకు చిరునామాగా మారిందరడంలో అతిశయోక్తి లేదు. మండల పరిధిలో అజిలాపురం గ్రామ సరిహద్దుల్లో రాచకొండ గుట్టల నడుమ అందమైన పాల నురగ పరవళ్ళు తొక్కుతుంది. అభివృద్ధిలో కాస్త వెనక ఉన్న చక్కటి వాతావరణం ప్రకృతి అందాలకు మండలానికి కొదవ లేదు. ఆహ్లాదకరమైన కొండల నడుమ ప్రకృతి సిద్ధంగా వెలసిన బుగ్గ వాటర్ ఫాల్స్ ప్రకృతి ప్రేమికులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. బుగ్గ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుండి గుట్టల నడుమ దాదాపు రెండు కిలోమీటర్లు కొండల అందాలను వీక్షిస్తూ నడుస్తుంటే మనకు ట్రెక్కింగ్ చేస్తున్న అనుభూతి కలుగుతుంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అకాల వర్షాలతో బుగ్గ జలపాతం ఉరకలు వేస్తూ ఇక్కడి కొండలకే వన్నెతెచ్చింది. రాచకొండ గుట్టలు రమణీయ దృశ్యాలకు కేరాఫ్‌గా ఉండడంతో హైదరాబాద్ రంగారెడ్డి జంట నగరాల నుంచి ప్రకృతి ప్రేమికులు ఇక్కడికి వచ్చి అందాలను వీక్షిస్తున్నారు. భూతల స్వర్గానికి పుట్టినిల్లుగా ఉన్న అజిలాపురం బుగ్గ జలపాతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే రాచకొండ గుట్టలు సినిమా షూటింగులు నిర్వహించుకోవడానికి అవకాశం ఉంటుందని అజిలాపురం గ్రామ ప్రజలతో పాటు ప్రకృతి ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.

# శివాలయంలో స్ఫటిక లింగానికి పూజలు

యాదగిరి కొండ, మేజర్‌న్యూస్ : యాదాద్రి అనుబంధ ఆలయం శివాలయంలో శ్రీ పర్వత వర్ధిని రామలింగేశ్వరుని ఆలయంలో సోమవారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు. యాదాద్రి కొండ పై అనుబంధ దేవాలయం శివాలయంలో పర్వత వర్ధిని శ్రీ రామలింగేశ్వరుడుకి అర్చకులు రుద్రాభిషేకం, రుద్ర హెూమం ప్రత్యేక పూజలు చేశారు, పార్వతీ దేవిని కొలుస్తూ శివాలయం ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలోని అర్చకులు కుంకుమార్చన జరిపారు. ఉదయం, శివునికి అభిషేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో, బిల్వ పత్రాలతో, ప్రత్యేకంగా అలంకరించి, స్వామి వారిని ఆరాధించారు. వేద మంత్రోచ్ఛారణ చేత ప్రత్యేక మంగళ హారతులతో స్వామి వారిని కొలిచారు.స్వామి వారిని భక్తులకు దర్శింప చేశారు.

